క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున బాధ్యులైన శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఉండాలని ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం అశ్వారావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, సిబ్బందితో వర్షాకాల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా చేపట్టాల్సిన చర్యలు, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం, డ్రైడే కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడారు. వైద్యాధికారులు రాందాస్ నాయక్, మధుళిక, ఎంపీఓ సీతారామరాజు, ఈఓ హరికృష్ణ, శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

చర్లరూరల్: మండలంలోని సత్యనారాయణపురం సీహెచ్‌సీ పరిధిలోని ఆర్ కొత్తగూడెం కాలనీ, తేగడ గ్రామాల్లో శుక్రవారం అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ)పై అవగాహన కల్పించి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ముప్పై సంవత్సరాలు నిండిన వారందరికీ రక్తపోటు, చక్కెర వ్యాధి, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ల నిర్ధారణ పరీక్షలతో పాటు అవగాహన కల్పించినట్లు డీపీఎంఓ సత్యనారాయణ తెలిపారు. హెచ్ఈఓ బాబూరావు, హెల్త్ అసిస్టెంటు గాదెమ్మ, ఆశా కార్యకర్త రాంబాయి పాల్గొన్నారు.

నకిలీలను అరికట్టాలి

బూర్గంపాడు: నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా కోశాధికారి జక్కుల రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం బూర్గంపాడులో రైతులతో కలసి ప్రదర్శన నిర్వహించి మండల వ్యవసాయశాఖ అధికారి శంకర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు వైఎస్ రెడ్డి, వీరమల్ల ఉమా, ముత్యాల సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వర్లు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

అశ్వారావుపేటరూరల్: మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. ఏపీలో ఉప ముఖ్యమంత్రిగా, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడంపై మండల కేంద్రంలోని అమ్మ అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు రూ.5వేల రూపాయాల ఖర్చుతో అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం బాధ్యులు యూఎస్ ప్రకాశ్‌రావు, తాడేపల్లి రవి, చిన్నంశెట్టి సత్యనారాయణ, కురిశెట్టి నాగబాబు, వాసా ఏసుబాబు, తోట దుర్గారావు, దేగల రాము, కట్టా శ్రీను, తరిగొప్పుల సూర్యనారాయణ(నాని), మాసా బత్తుల శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించండి

చర్ల: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కలుషితమవుతున్న తాగునీటిపై అధికారులు దృష్టిసారించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ డిమాండ్ చేసింది. శుక్రవారం పార్టీ మండల కార్యదర్శి కొండా కౌశిక్‌తో పాటు పలువురు నాయకులు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో తాగునీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కొండా కౌశిక్ మాట్లాడారు. గ్రామంలోని ఉన్న మిషన్ భగీరథ పైపులకు పెద్ద ఎత్తున లీకులు ఏర్పడ్డాయని, దీని వల్ల నీరు బయటకు వచ్చి బురద ఏర్పాడి.. తిరిగి ఆ బురద నీరు తాగునీటిలో కలుస్తోందని అన్నారు. నీరు కలుషితం అవుతున్న ఈ వ్యవహారంపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉచితంగా ఇవ్వాలి

ములకలపల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఉచితంగా ఎరువులు, పురుగు మందులు అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. మండలపరిధిలోని నర్సింహాపురంలో సవళ్ల ఆదినారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండలకమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కుంజా కృష్ణ, కొండపునేని సత్యనారాయణ, వంకా సురేశ్, దుబ్బా వెంకటేశ్వర్లు, ముదిగొండ మల్లన్న, బత్తుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతులు

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని గ్రామస్తులు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు, పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. శుక్రవారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో ఎమ్మెల్యేను, నియోజకవర్గ పరిధిలోని పలువురు గ్రామస్తులు, స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు రద్దు చేయండి

దమ్మపేట: మండల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో, 1/70 చట్టం నిబంధనలకు విరుద్ధంగా జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కోరుతూ.. బీజేపీ నాయకులు మండల తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు కోలికపోగు ముసలయ్య, చెన్నారావు, ప్రశాంత్, నాగరాజు పాల్గొన్నారు.

వాన కురిసింది.. సాగు మొదలైంది..

- ఆలస్యంగా పలకరించిన తొలకరి
- ఎదురుచూపుల నుంచి రైతులకు ఊరట

బూర్గంపాడు: కొంత ఆలస్యంగానైనా వరుణుడు కరుణించాడు. వానల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఊరట లభించింది. పదిరోజుల క్రితం కురిసిన వర్షానికి భూములు సిద్ధం చేసుకుని సాగు పనులు ప్రారంభించిన రైతులు ఆ తరువాత చినుకు పడకపోవటంతో ఆందోళనకు గురయ్యారు. మణుగూరు, భద్రాచలం వ్యవసాయ డివిజన్‌లలో సుమారు 15 వేల ఎకరాలలో రైతులు పత్తిగింజలు వేశారు. అయితే వానలు కురవకపోవటంతో రోజు ఆకాశంకేసి చూస్తున్నారు. గత మూడు రోజుల నుంచి వాతావరణ శాఖ నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్నాయని చెబుతున్న వానలు మాత్రం కురవలేదు. శుక్రవారం ఉదయం నుంచి విపరీతమైన ఎండతో ప్రజలు అల్లాడారు. సాయంత్రానికి మబ్బులు కమ్మి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. భూములలో వేసిన పత్తిగింజలు దెబ్బతింటాయని భావించిన రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

ఇక విత్తడమే ఆలస్యం..

భద్రాచలం, మణుగూరు వ్యవసాయ డివిజన్‌లలో సుమారు 75 వేల ఎకరాల్లో రైతులు పత్తిసాగు చేస్తారు. దాదాపుగా ఈ భూములన్ని వర్షాధారంగా సాగు చేసేవి. జూన్ మొదటివారంలోనే రైతులు పత్తిసాగు చేయటం ఇక్కడ పరిపాటిగా వస్తుంది. పొడిదుక్కులలోనే రైతులు విత్తనాలు వేయటం, తొలకరి వర్షాలకు అవి మొలకెత్తటం జరుగుతుంది. అయితే ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కొంత ఆలస్యం కావటంతో రైతులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం కురిసిన వర్షానికి పత్తి గింజలు మొలకెత్తుతాయని రైతులు చెబుతున్నారు. పత్తి గింజలు వేయనటువంటి రైతులు కూడా సాగు పనులకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే భూములను దున్ని విత్తనాలు వేసేందుకు సిద్ధం చేశారు. శుక్రవారం కురిసిన వర్షంతో రైతులు విత్తనాలు వేసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. పత్తి విత్తనాల కొనుగోళ్లు, కూలీలను పిలుచుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

రెడీగా వరినార్లు..

మాగాణి భూముల్లో పచ్చిరొట్ట ఎరువుగా రైతులు జీలుగులు చల్లుకున్నారు. ఇప్పటి వరకు వర్షాలు లేకపోవటంతో జీలుగులు మొలకెత్తలేదు. ఈ వర్షానికి జీలుగులు కూడా మొలకెత్తుతాయని రైతులు ఆనందం వెలిబుచ్చుతున్నారు. అదేవిధంగా మాగాణులలో వరిసాగు చేసుకునేందుకు వరినార్లు పోసేందుకు కూడా రైతులు సిద్ధమవుతున్నారు. ఈ రెండు వ్యవసాయ డివిజన్‌లలో సుమారు 85 వేల ఎకరాలలో రైతులు వరిసాగు చేస్తారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో రైతులు సన్నరకం వరిరకాలను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 30కి పైగా సన్నరకం వరి వంగడాలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించింది. దీంతో రైతులు అందులో ఏ రకం విత్తనం ఎక్కువ దిగుబడులు వస్తాయని చర్చించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే బోనస్ పొందాలంటే తప్పనిసరిగా సన్న రకం ధాన్యాన్ని సాగు చేయాలి. రైతులు ఆ దిశగానే వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ రెండు వ్యవసాయ డివిజన్‌లలో బీపీటీ-5204, ఎంటీయు-1224, ఆర్ఎన్ఆర్ వంటి సన్నరకం వరి వంగడాలను సాగు చేసేందుకు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు.



పత్తిలో పైపాటు చేస్తున్న రైతు

రైతుబంధు అందేనా..?

వ్యవసాయ సీజన్ ఆరంభమవుతుండటంతో రైతులు విత్తనాలతో పాటుగా ఎరువులను కూడా కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది ఒకట్రెండుసార్లు యూరియా దొరకలేదు. దీంతో రైతులు ఈ ఏడాది ముందుగానే యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా(రైతుబంధు) కోసం వేచిచూస్తున్నారు. గత ప్రభుత్వం రైతుబంధు కింది పెట్టుబడి సాయంగా ఎకరాకు రెండు విడతలుగా రూ.10వేల పెట్టుబడి సాయమందించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు విడతలుగా ఎకరాకు రూ.15వేల పెట్టుబడి అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ హామీని ప్రభుత్వం అమలు చేస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వం పంటరుణాలను మాఫీ చేస్తుందని హామీ ఇచ్చింది. తొందరగా రుణమాఫీని అమలు చేస్తే తిరిగి పంటరుణాలు పొందుతామని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి సాయమందించాలి



ప్రభుత్వం పెట్టుబడి సాయం తొందరగా అందించాలి. జూన్ నెలలో రైతు భరోసా అందిస్తే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకుంటాం. వర్షాలు కురుస్తుండటంతో విత్తనాలు వేసుకుంటున్నాం. ఇప్పటికే చాలామంది రైతులు పత్తి వేశారు.

– ఆవుల వెంకటేశ్వరరెడ్డి, రైతు

రుణమాఫీ చేయాలి



ప్రభుత్వం రుణమాఫీ వెంటనే అమలు చేయాలి. రుణమాఫీ చేస్తే బ్యాంకులలో మళ్లీ లోన్లు ఇస్తారు. దీంతో పెట్టుబడులకు ప్రైవేటు అప్పులు చేసే అవసరముండదు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– యారం వెంకటరెడ్డి, రైతు

భద్రాచలంలో భారీ వర్షం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా గాలిదుమారం, ఉరుములు మెరుపులతో సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. భారీ గాలిదుమారానికి పట్టణంలోని పలు కాలనీలలో చెట్ల కొమ్మలు ఇరిగిపడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పాడింది. లోతట్టు కాలనీలలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పాటు కొంతవరకు కబ్జాకు గురికావడంతో కాలువలు పొంగి రోడ్లపైకి వరద నీరు చేరింది. దీంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత వారం రోజులుగా ఉక్కతో ఇబ్బందులు పడిన పట్టణ వాసులు వర్షంతో ఉపశమనం పొందారు.

బూర్గంపాడు మండలంలో..

బూర్గంపాడు: శుక్రవారం సాయంత్రం గాలితో కూడిన భారీ వర్షానికి పలుచోట్ల చెట్లు విరిగిపడిపోయాయి. మోతె పట్టీనగర్ గ్రామంలో భారీ వృక్షం గాలివానకు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో ఆ రహదారిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. స్థానికులు పడిపోయిన చెట్టు కొమ్మలను కొంతమేరా తొలగించి వాహనాల రాకపోకలకు చర్యలు చేపట్టారు.



భద్రాచలంటౌన్: రామాలయం సమీపంలోని అన్నదాన సత్రం వద్ద రోడ్డుపై నిలిచిన నీరు



బూర్గంపాడు: మోతె పట్టీనగర్ వద్ద రోడ్డుకు అడ్డంగా పడిపోయిన భారీ వృక్షం

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

అన్నపురెడ్డిపల్లి: తొట్టిపంపు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ మహాలక్ష్మి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను, స్టాక్‌కునుథ పరిశీలించి, గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు.అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆమె వెంట పంచాయతీ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

చంద్రుగొండ: పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గొత్తికోయ ఆదివాసీలకు డాక్టర్ కనకం తనుజ సూచించారు. మండలంలోని బెండాలపాడు శివారు కనకగిరి అటవీ ప్రాంతంలోని ఎర్ర బోడులో శుక్రవారం వైద్యశిబిరంతో పాటు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ చిన్నారులకు వైద్యపరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆవాసాలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని వారికి అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు యండీ.ఇమాం, పద్మ, సిబ్బంది శ్రీను, సుజాత, రాజేశ్వరి, అరుణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ములకలపల్లి: మండలవ్యాప్తంగా నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో లక్ష్మీనర్సింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కరెంటు నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (శనివారం) పెనుబల్లి, పెంట్లం విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మత్తుల నిర్వహించనున్నట్టుగా తెలిపారు. ఈ కారణంగా నామవరం, కంపగూడెం, భాస్కరాపురం, బుచ్చన్నగూడెం, పెంట్లం, నర్సాపురం, అన్నపురెడ్డిపల్లి, అన్నదైవం, తెలిజర్ల, ఒడ్డుగూడెం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ

కరకగూడెం: మండలంలోని పద్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని వలస ఆదివాసీ గ్రామమైన నీలాద్రిపేట అంగన్వాడీ కేంద్రంలో 13 మంది ప్రీస్కూల్ చిన్నారులకు హైదరాబాద్ వారి 'సమిష్టి సహస్ర' సహకారంతో ఆధార్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆధార్ సంస్థ డైరెక్టర్ తోలెం రమేష్ స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పిల్లలను ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని, ప్రీస్కూల్ కార్యక్రమాల ద్వారా పిల్లలో నైపుణ్యం పెరుగుతుందనే విషయాన్ని చిన్నారుల తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత, ప్రైమరీ స్కూల్ టీచర్ కుమారస్వామి, ఆధార్ సంస్థ సభ్యులు బట్ట బిక్షపతి, రాజబాబు, గ్రామ పెద్దలు సోడి మాడారం, భీమయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతమైన రక్తదాన శిబిరం



చర్లరూరల్: సీహెచ్‌సీలో రక్తదానం చేస్తున్న స్థానికులు

చర్లరూరల్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా చర్ల పోలీస్ శాఖ, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్, మీకోసం మేమున్నాం సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ సీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్త నిల్వలు లేక పోవడంతో వివిధ అత్యవసరంగా రక్తం అవసరమయ్యే వారు ఇబ్బందులు పడుతుండడంతో.. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 40 మంది రక్తాన్ని అందించారని, సేకరించిన రక్తాన్ని భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పంపిస్తామని చర్ల సీహెచ్‌సీ వైద్యాధికారి బి.సాయివర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి రామాంజనేయులు, నీలి ప్రకాష్, గొట్టిపాటి శ్రీనివాసరావు, సాయిల వెంకటేశ్వరరావు, ఆర్‌కె సీడ్స్ నవీన్, శ్రీమన్నారాయణ, దొడ్డి సూరిబాబు, కోటి విజయ్, చిరునోముల కిరణ్, చింతల రాము తదితరులు పాల్గొన్నారు.

66వ సారి రక్తదానం

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆశ్వాపురం మండలం తుమ్మలచెరువుకి చెందిన తాటి పవన్ అనే యువకుడు ప్రాణాపాయ స్థితిలో ఉండి, చికిత్స నిమిత్తం ఓ నెగెటివ్ రక్తం కావాల్సి ఉండగా.. ఇదే విషయాన్ని జిందా బ్లడ్ ఆర్గనైజర్ మహమ్మద్ జిందా తెలుసుకుని ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా 66వ సారి రక్తం అందించాడు. బాధిత కుటుంబ సభ్యులు సకాలంలో రక్తదానం చేసిన జిందాకు కృతజ్ఞతలు తెలిపారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

అశ్వాపురం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత పరీక్షలు గత డిసెంబర్ నెలలో జరగగా మండల పరిధిలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన నేతల అక్ష, బత్తిని రక్షిత, జొన్నలగడ్డ హర్షవర్ధన్, మైపా శ్రీవర్ష, బానాల సృజన ఎంపికయ్యారు. వీరికి ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు చొప్పున నాలుగు సంవత్సరాలు 48వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తారు. మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం గోపివరప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

అన్నపురెడ్డిపల్లి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్‌స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) 2023-24 ప్రతిభా పరీక్షల్లో మండల పరిధిలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కాకిరాల చరణ్ ఉత్తీర్ణత సాధించాడు. గురువారం విడుదల చేసిన ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడని, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల నుంచి ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థి చరణ్ మాత్రమే అని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ తెలిపారు. విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఉత్తీర్ణత సాధించే విధంగా పాఠశాలలో తగిన శిక్షణను ఉపాధ్యాయులు అందిస్తారని ఆయన చెప్పారు. మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

రైతుల మృతిపై సమాచారం అందించండి

చర్ల: ఎవరైనా రైతులు మరణించినట్లయితే వారికి సంబంధించిన సమాచారాన్ని వ్యవసాయశాఖకు 24 గంటల్లోపై అందజేయాలని మండల వ్యవసాయశాఖాధికారి పి.శివరాంప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక పరకటన విడుదల చేశారు. మరణించిన రైతులకు సంబంధించి రైతు బీమా కింద ఇన్సూరెన్స్ క్లెయిమ్ కావాలంటే మరణించిన రైతుకు సంబంధించిన సమాచారాన్ని ఇన్సూరెన్స్ కంపెనీకి తెలిచజేయాల్సి ఉంటుందని ఆయన సూచించారు. మరణించిన రైతులకు సంబంధించిన సమాచారాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి ఎంపి.అఫ్రీద్ మొబైల్ నంబర్ 9390124157కు గానీ, మండల వ్యవసాయశాఖాధికారి పి.శివరాంప్రసాద్ 6303241536 నంబర్‌కుగాని ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కేశవరావు

అశ్వాపురం: ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం మాజీ అధ్యక్షుడు పాడ్య కేశవరావును నియమించారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ.జలీల్, ప్రధాన కార్యదర్శి గడ్డం రమేష్ నియామకపత్రాన్ని కేశవరావుకు అందజేశారు. బీఆర్ఎస్ అనుబంధ టీఆర్‌టీయూ నాయకుడుగా ఉన్న కేశవరావు పార్లమెంట్ ఎన్నికల ముందు ఐఎన్‌టీయూసీలో చేరారు. కేశవరావు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సహాయ కోశాధికారిగా ఉన్నారు. గతంలో భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం అధ్యక్షుడుగా రెండు సార్లు ఎన్నికయ్యారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయన నియామకంపై భారజల కర్మాగారం ఐఎన్‌టీయూసీ నాయకులు గడ్డం రమేష్, చిన్న గురవయ్య, పెద గురవయ్య, పెదిరెడ్ల శ్రీనివాసరావు, వినయ్‌సాగర్, రామిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కళ్యాణచక్రవర్తి హర్షం వ్యక్తం చేశారు.



ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జలీల్‌తో కేశవరావు, సంఘం నాయకులు

విద్యుత్ ఉద్యోగుల ప్రతిజ్ఞ

దుమ్ముగూడెం: విద్యుత్ సిబ్బంది ప్రమాదాల నివారణ, భద్రతకు సంబంధించి శుక్రవారం పెప్ టాక్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా విధుల్లోకి వెళ్లే ఉద్యోగులతో వ్యక్తిగత భద్రతా పరికరాలు వెంట ఉండేలా చూసుకుంటామని, తాము రోజు భద్రతా ప్రమాణాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఈ మోహన్‌రెడ్డి, సబ్‌ఇంజనీర్ రాజేష్, లైన్‌మేన్స్ నాగేశ్వరావు, వెంకట్ పాల్గొన్నారు.

ఈజీ చైర్స్ వితరణ

చర్లరూరల్: చర్ల శాఖా గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులు, పాఠకులు చదువుకునేందుకు వీలుగా ఉండే విధంగా రూ.5వేల విలువ చేసే ఈజీ చైర్స్‌ను రైతుక్లబ్ చైర్మన్ కొత్తపల్లి రామాంజనేయులు శుక్రవారం అందజేశారు. మీకోసం మేమున్నాం టీం చైర్మన్ నీలి ప్రకాష్ చేతుల మీదుగా లైబ్రేరియన్ చుక్కబొట్ల వంశీకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శిరిపురపు శివ,గూడూరు కృష్ణమూర్తి, చంటి, మర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సందర్శన

అశ్వారావుపేట: అశ్వారావుపేట సీహెచ్‌సీని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం రాత్రి సందర్శించారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చనిపోయిన సంఘటనలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, ఆస్పత్రిలోని వార్డులలో చికిత్స పొందుతున్న సాధారణ రోగులను కలిసి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

ర్యాపిడ్ ఫీవర్ సర్వే

దుమ్ముగూడెం: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలని దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పుల్లారెడ్డి సూచించారు. శుక్రవారం దుమ్ముగూడెం పీహెచ్‌సీ పరిధిలో గల గ్రామాలలో జరుగుతున్న ర్యాపిడ్ ఫీవర్ సర్వే, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వచ్చే వ్యాధుల(సీజనల్ వ్యాధుల)పై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉంచొద్దని వివరించారు.

చర్లరూరల్: మండలంలోని సత్యనారాయణపురం, తేగడ, గణేశ్ నగర్ గ్రామాల్లో వైద్య సిబ్బంది శుక్రవారం రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. రాళ్ళగూడెం, లక్ష్మీకాలనీ గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే నిర్వహంచారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

ఆర్థిక సాయం

బూర్గంపాడు: అనారోగ్యంతో బాధపడుతున్న సారపాకకు చెందిన వర్కింగ్ జర్నలిస్ట్ మందపాటి వెంకటరెడ్డి వైద్య ఖర్చులకు మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందించింది. శుక్రవారం నేస్తం ట్రస్ట్ ప్రతినిధులు వెంకటరెడ్డి ఇంటికి వెళ్లి వైద్య ఖర్చులకు రూ.8వేలను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి, వైస్ చైర్మన్ చింతా అంకిరెడ్డి, సంకా సురేష్, డి.బాలనారాయణరెడ్డి, ఆవుల నాగార్జున, సొసైటీ డైరెక్టర్ బత్తుల రామకొండారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన జాతర



నిప్పుల గుండం దాటుతున్న భక్తులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుర్రాల చెరువు గ్రామంలో గడిచిన 5 రోజులుగా జరుగుతున్న చిన్న కొర్రాజు స్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. స్వామి వారిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించగా, ఇంటింటికీ తీసుకెళ్లగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని హారతులు పట్టారు. నిప్పుల గుండాలు ఏర్పాటు చేయగా, భక్తులు నిప్పుల గుండాన్ని దాటారు. అనంతరం అన్నసమారాధ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా.. సందడి నెలకొంది.

మాజీ ఎమ్మెల్యే నివాళి

దమ్మపేట: అనారోగ్యంతో మృతి చెందిన మహిళ భౌతికకాయాన్ని, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సందర్శించి, నివాళులర్పించారు. శుక్రవారం మండలంలోని నాచారం గ్రామానికి చెందిన చీకటి ఆదినారాయణ సోదరి అనారోగ్యంతో మృతి చెందగా.. మెచ్చా నాగేశ్వరరావు ఆమె భౌతిక కాయానికి పూలతో నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాడ సానుభూతిని తెలియజేశారు.

లేబర్ కోడ్‌లు అమలు చేయొద్దు

గుండాల: కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన లేబర్ కోడ్స్‌ను తెలంగాణా రాష్ట్రంలో అమలు చేయొద్దని, కార్మికులకు సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్ షావలి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆ సంఘం 2వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ మండల అధ్యక్షుడిగా గడ్డం రమేష్, కార్యదర్శిగా కొమరం శాంతయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. ఉపాధ్యక్షులుగా మొక్క నరి, సహాయ కార్యదర్శిగా కల్తి ఆదినారాయణ, కోశాధికారిగా ఎస్‌కె.పాషాలతో పాటు మరో ఐదుగురిని ఆఫీస్ బేరర్లుగా, 18 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను కడుబానిసలుగా చేసేందుకు నాలుగు లేబర్ కోడ్స్‌ను తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాలు చేపట్టారు. నూతనంగా పాఠశాలల్లో చేరిన మొదటి సంవత్సర చిన్నారులకు పలక, బలపం చేతబట్టించి అక్షరాలు దిద్దించారు. బడిబాటలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేశారు. కాగా, పలుచోట్ల అక్షరాభ్యాసంతోపాటు విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



దమ్మపేట: ఎమ్మెల్యే జారే ఆధ్వర్యంలో..



అశ్వాపురం: ఎంపీపీ సుజాత ఆధ్వర్యంలో..



కరకగూడెం: పాఠ్యపుస్తకాల పంపిణీ..



చంద్రుగొండ: ఎంఈఓ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం